# బెలూన్ బొమ్మ

ప్రనీత్

"కాబూలీవాలా" చదువుతూ కూచున్నాను.

"చిన్నప్పుడు చదివినవే మళ్ళీ మళ్ళీ చదువుతారేం నాన్నగారూ? అలవాటు కొద్దీ ననుకుంటా" అంటున్నది వనజ ఆటలు పట్టిస్తూ. మా ఇద్దరి మధ్యా సాగిపోయే వాద ప్రతివాదనలు ఇద్దరికీ కంఠస్థమే. ఏదో అనకుండా ఊరుకోదు. నేను నా నమ్మకాలను గురించి చెప్పకుండా వుండలేను.

"అలాంటి రచనలు ఇప్పుడు చేయటంలేదు. కదమ్మా. కొత్తవాటిల్లో ఏవన్నా వుంటే చదవనంటున్నానా?"

"యౌవనంలో చదివిన ఆ రచనలే ఇప్పటికీ మీకు నచ్చటానికి. రచనలలోని పటుత్వం కన్నా, మీరు వాటిని యౌవనంలో చదవటమే కారణమని ఒప్పుకోరాదు నాన్నగారూ? యౌవనంలో మీకు కలిగిన మధురానుభూతులు ఆ రచనలతో పెనవేసుకుపోయినై. అది మీ యౌవన భాగ్యమనండి, దోషమనండి. వాటికి మీరిచ్చే ప్రత్యేకస్థానం, ఆ కారణంచేత ఏర్పడ్డదేకానీ, కేవలం ఆ రచనల్లోని విశిష్టత కాదు. ఈ నాడూ మంచి రచనలే వస్తున్నా, మీ కవి పేలవంగా కనిపిస్తున్నవంటే ఈ వయసులో మీరు వాటిలోకి ప్రవేశించలేరు కాబట్టి— హృదయంలో ప్రవేశించలేరు. కళ్ళతో చదువుతారు. విసుక్కుంటారు. మీ హృదయం కలగా పులగంగా ఆ పాత్రలో మిళితమవటం లేదు, అంతే కదూ? నిజం చెప్పండి."

వనజ తెలివైనది. దాని చిన్నతనంలో తెలివిగా మాట్లాడుతుంటే, నా తెలివిలో ఒక భాగం పంచుకోనుంటుందిలే అని నవ్వేసి ఊరుకునే వాణ్ణి. పెరిగి, ఈ నాడు కాలేజీకి వెళ్తావుండే వయస్సులో ఇలా తర్కిస్తున్నప్పుడు, ఇలా ఆటలు పట్టిస్తున్నప్పుడు, ఎలా సమాధానం చెప్పడమో నాకు తెలీను.

కాబూలీవాలా, మిన్నీ, ఆ కథలు, ఆ కాలపు మందగమనం, ఆ పసక కుర్రీల జీవితం— ఎంత మారిపోయింది! కూచునే వీలెక్కడ? ధరలు పదింతలు పెరిగితే, కోరికలు పాతికింతలుగా పెరిగికూచునై. ధరల పెరుగుదలను అరికట్టమనే నినాదాలేకానీ, కోరికల నదుపులో పెట్టమనే నినాదాలేవీ? అలాంటి నినాదం ఒక్క గాంధీయే ఇవ్వగలడు. ఈ నాడు ఎవరైనా అలాంటి నినాదాన్ని ఇవ్వబూనుకున్నారంటే. ఆ ధాంభికత్వం చూసి ప్రజలు విరగబడి నవ్వుతారు. ధరల కుందేళ్ళ ఉరుకు, రాబందుల తాడేటి నడక. కోరికల హోరు— ఎక్కడి టాగూరు. ఎక్కడి పసకకుర్రీలు. ఎక్కడి వానచినుకుల టపటప. ఎక్కడి కాబూలీవాలా. ఎక్కడి మిన్నీ— ఆ రచనలు నేటి జీవితానికి పనికిరావు. ఈ నాటి రచనలుచదివి ఆనందించే ఓపిక లేదు.

గిరగిర. గరగరమని చప్పుడు. "నాన్నా, నాన్నా, నాకది కొనవూ" అంటూ "చిన్ని" కేక, ఎక్కడో ఆడుకుంటున్న పిల్ల పరుగున వచ్చి. మెడను వేళ్ళాడేసుకొని, "కొనవూ, కొనవూ" అంటూ దీర్ఘాలు.

"అందులో ఏముందమ్మా. అదేదో పెంకు. అగ్గిపుల్లా. దారంముక్కాపెట్టి తయారుచేసి వుంటాడు. అదేదో చౌకరకం. నీ దగ్గర ఎంత సేపు వుంటుందమ్మా. ఇట్టే ఊడి ఊరుకుంటుంది."

చిన్నికి ఈ మాటలు అర్థమయ్యే వయసు కాదు. నాలుగేళ్ళు నిండలేదు. కోరికలు చంపుకొమ్మని చెప్పినా, అర్థంచేసుకునే వయసు కాదుమరి—

"నాన్నా, నాన్నా, వాడు వెళ్ళిపోతున్నాడు నాన్నా"

"మళ్ళీ ఇటే వస్తాడులే అమ్మా"

"రాదు నాన్నా, రాడు. ఇంతకుముందుకూడా ఒకసారి ఇంతే అయింది నాన్నా. నీకు గుర్తు లేదూ?"

* * *

నాకు బాగా గుర్తుంది. ఆ నాడు ఉదయం నుంచి ముసురుపట్టి వర్షం కురుస్తూనే వుంది. సాయంత్రంకాబోలు కాస్త తెరిపిఇచ్చింది. అప్పుడెవడో ఒక కుర్రాడు ఒంటితీగె తంబూరాలాగ కొన్నిటిని తయారుచేసి చిన్న కమానుతో వాయించుకుంటూ వచ్చాడు. అది కొనమని చిన్ని తన కోరిక వెలిబుచ్చింది. "ఆ వెధవది మన దగ్గర కొచ్చేసరికి పలకదంటాను నేను. దీనికి సమాధానంగా చిన్ని దుఃఖం ప్రదర్శించింది.

"అది వాడే వాయించగలడుకానీ. మనం వాయించలేమమ్మా" అని వాదించబోతాను. చిన్ని రాగాన్ని పెద్దదిచేసింది. కొంచెంసేపట్లో కంటికి మింటికి ఏకధారగా ఏడ్వటం మొదలెట్టింది. తెరిపి ఇచ్చినట్లుగానే [illegible] మళ్ళీ జోరుగా ప్రారంభమైంది, చిన్ని, మాట వినిపించుకోవటంలేదు.

యౌవనంలో పిల్లల్ని దెబ్బ చేసుకోటానికి వెనకాడే వాణ్ణికాదు. పిల్లల్ని కొట్టడం మహాపరాధమనే సిద్ధాంతం అప్పటికింకా బాగా ప్రచారంలోకి రాలేదు. ఇప్పుడెలా కొట్టాను? పిల్లల్ని కొట్టినందువల్ల వారిలో ఎటువంటి విపరిణామాలు రాగలవో తెలియజేసే విజ్ఞానం ఇంతగా చదివిన తర్వాత? ఆధునిక విజ్ఞాన భారం ఎంతగా మోస్తున్నానో? చిన్ని పుట్టగానే వేసక్టమీ చేయించుకున్న నాకు, ఇప్పుడే పిల్లను కొట్టాలంటే చేతులాడలేదు. చిన్ని దుఃఖం కట్టలు తెంచుకుంది. బయట ఉరుములు. మేఘాలతో వాన. తప్పలేదు. "బుంయ్ బుంయ్" మనేవాడి ఒంటితీగెమీద కమాను శబ్దం ఎక్కడా వినిపించటం లేదు. వాడే సందు చేరాడో? ఎక్కడని వెతకను? చదువుతున్న శరత్‌ను పక్కనబెట్టి గొడుగు తీసుకుని. ఆ సంధ్య చీకట్లో వాణ్ణి వెతుక్కుంటూ వెళ్ళాను! ఒక్కొక్కరి ఇంటి వరండాలోకి తొంగిచూస్తూ. అటుతిరిగి ఇటు తిరిగి, అరగంట అయిం తర్వాత వాణ్ణి ఒక చెట్టు కింద తలదాచుకుంటుండగా కనుగొన్నాను. వాడి దగ్గర అది కొనుక్కొని జడివానకు దేహం కిందిభాగం తడిసిపోతున్నా ఆ "ఏకతారను" మాత్రం తడవకుండా గుండెలగ్గర అదుముకుంటూ తీసుకువచ్చి చిన్నికిచ్చాను.

కోర్కెలు బలీయమైనవి. చిన్ని కోర్కెలు నిరాకరింపగలిగినవి కాదు. నాకు గుర్తు లేకేం? దాని కోర్కెలన్నీ అదే క్షణాన తీర్చవలసినవి. బాగు పదివిధాల చేటు.

* * *

"వెళ్ళిపోతున్నాడు నాన్నా. పిలువు నాన్నా."

పిలిచాను. చిన్ని ముఖం వికసించింది. వచ్చాడు. ఎవడో ముసలి ముస్లిం. వాడి దగ్గర రెండురకాల బొమ్మలున్నై. చేతితో తిప్పే ఆ "గిర్గిరాలు" అవికాక బెలూన్‌లను చిత్ర విచిత్రమైన పద్ధతుల్లో అచ్చటచ్చటా దారాలు బిగించి తయారుచేసిన మానవాకృతులు చిన్ని ఆకర్షింపబడింది. శ్రవణేంద్రియాలచే నైనా వాడు తీరా దగ్గరకు వచ్చేసరికి, దాని నయనేంద్రియాల ఆకర్షణే ఎక్కువైంది. నేను "గిర్గిరా" కోసం అడగబోతుంటే అద్దొద్దు నాన్నా. ఈ బెలూన్ బొమ్మ కొను నాన్నా" అన్నది.

"ఎంతోయ్ సాయిబూ?" అంటూ ఒక మానవాకృతిని, వాడు పట్టుకున్న కర్రనుంచి విప్పాను.

"దస్‌పైసా మహరాజ్" అన్నాడు. పాతకాలంవాడు. ఎక్కడి మహరాజ్? ఏనాటి మాట? పాతికేళ్ళ కిందట ఎక్కడ పడితే అక్కడ వినిపిస్తుండేది. ఇప్పుడామాట ఎక్కడ వినిపిస్తుంది?

ఈ చిన్న వస్తువుకోసం బేరం చేయటం నా కిష్టంలేదు, అలవాటుకొద్దీ బేరం చేశాను.



వాడు నన్ను తెలివితక్కువ వాడికింద జమ కట్టాడేమోననే భయంకొద్దీ, నాకు లౌకికజ్ఞానం లేదని ఈ ఇరవైఏళ్ళ అనుభవంతో తీర్మానించుకున్న నా భార్యను దృష్టిలో పెట్టుకొని, బేరానికి దిగాను.

"దీనికి పది పైసలు ఎందుకు సాయిబూ, అణా చేస్తుంది. తీసుకో" ఎక్కడి అణా, ఏరోజులనాటి అణా? ఏవీ అణాకాసులు?

నేను మనస్ఫూర్తిగా బేరం చేయటంలేదని అతడికి తెలుస్తూనే వుంది.

"ఆ రోజులు పోయినై మహరాజ్. పది పైసల కమ్మకపోతే మేమేం తినాలి?"

అవును ఆ పిక్కుపోయినకళ్ళే చెప్తున్నై. అతడికి తిండి తక్కువని, ఏం తినాలి? అలాంటి వారందరూ ఏమితిని పొట్ట నింపుకుంటున్నారో?

* * *

కళ్ళు, చెవులూ, ముక్కూ తమాషాగా అమర్చాడు ఆ బెలూన్‌కు. చిన్ని, ఆ బొమ్మను దగ్గరకు తీసుకొని ఆడుకుంటూవుంది. పేపరు వాడొచ్చి దినపత్రిక పడేసి వెళ్ళిపోయాడు. ఉత్తర హిందూస్థానంలో మళ్ళీ మతకలహాలు. మసీదుల దగ్గరగా వెళ్ళిన మేళాలు, ఎక్కడో వినాయకుడి విగ్రహంపై అత్యాచారం. తత్కారణంగా పెరిగిన ఆగ్రహం. అంతే, అవి చాలు ఆకాస్తే చాలు, నిప్పు రాజుకోటానికి, అగ్ని ప్రజ్వరిల్లటానికి. ఇదివరకూ హిందూ ముస్లిం మతసామరస్యంకోసమే జపిస్తూ తపిస్తూ ప్రాణం విడిచిన మహాత్ముడు ఎంత దుఃఖించాడో ఆ రోజుల్లో! ఆ దుఃఖం అతడ్ని కార్యోన్ముఖుడ్ని చేసేది. తక్షణం బయలుదేరేవాడు ఆ ప్రాంతానికి. నేడేడీ ఆ హిమాలయంలాంటి మనిషి?

అటు ముస్లిములకుగానీ, ఇటు హిందువులకు గానీ, ఎవరికైనా ఏమాత్రం సలహా చెప్పేవాడేడీ? వారి కష్టసుఖాల్లో పాలు పంచుకోటానికి. వారి హృదయాల్లో ప్రవేశించి శాంతిజ్యోతిని వెలిగించేవాడేడీ? ఇప్పుడు మన పరిష్కారమల్లా. ఇలాంటి సంఘటనలు జరగడానికి కారణాలేమిటో కనుక్కోడానికి ఢిల్లీలో ఒక సెమినార్ ఏర్పాటుచేయడం. సాంఘిక శాస్త్ర నిపుణులూ, అన్నిశాస్త్రాల్లోనూ ప్రవీణులమైనట్లు నటించే రాజకీయ నాయకులూ హుటాహుటిని ఢిల్లీకో మరేదో ప్రధాన నగరానికో వెళ్ళి ఆ చర్చల్లో పాల్గొనడం. మతకల్లోలాల మధ్యనా మనస్థానం, వీలైనంత ఎరంగానా?

చిన్ని నలిపినందువల్లనేమి, దానంతటఅదే గాలి తగ్గిపోవటంవల్లనేమి, ఆ బెలూన్‌మీది మానవాకృతి క్షీణిస్తూనేవుంది. ఆ రాత్రి, ఆ క్షీణించిన బొమ్మని విడవకుండా మంచంలో పెట్టుకొనే నిద్రపోయింది. నాకు సరిగా నిద్రపట్ట లేదు. ఈ కలహాలు చల్లారవా? వీటికి పరిష్కా-

# బెలూన్ బొమ్మ

కంలేదా? ఏ రాత్రప్పుడో చిన్ని ఆ బెలూన్ మీదికి దొర్లనేదొర్లింది. అది ఠప్‌మనే చిన్న శబ్దంతో పగిలిపోయింది. చిన్ని నిద్రపోతూనే వుంది. నేనూ ఆలస్యంగా నిద్రపోయాను.

బరువుగా లేచాను. బాగా తెల్లవారింది. ఇంకా నిద్రమత్తు పూర్తిగా వదలలేదు. ఇంటివెనక భాగం దొడ్లోనుంచి పనిచేసే మనిషి మాటలు వినిపిస్తున్నాయ్. "నిన్నరాత్రి ఆ వీధిలో వున్న వాళ్ళని చాలామందిని చంపినారమ్మా. పోలీసులు గస్తీ తిరుగుతా వుంటారు. ఆ దిక్కునుంచి వచ్చే వాళ్ళనందర్నీ పిలేస్తావుంటారు. గుబులవుతా వుందమ్మా, ఎట్టారావాల్నో ఎట్టా పోవాల్నో"

ఉలిక్కిపడి కూర్చున్నాను. అది నివసించేవి నాలుగైదు ఫర్లాంగుల దూరంలోనే. ఎవర్ని ఎవరు చంపారు? రేడియో తిప్పాను. ఏమీ తెలీలేదు. పేపరు చూశాను. అందులో ఏమీ లేదు. ఎక్కడో చెదురు మదురుగా ఇంకా అల్లర్లు చెలరేగుతున్నాయనే వార్తలు తప్ప. ఇక్కడ, ఈ పట్టణంలో, మా యింటికి చేరువలోనే జరిగిన సంఘటనకు పుకార్లమీద ఆధారపడవలసిందే.

"నాన్నా, బెలూన్‌బొమ్మ రాత్రి పగిలిపోయింది నాన్నా. ఎంచక్కగా వుండేదో." ఆ వాక్యంలోని భూతకాలం నన్ను భయపెట్టింది. ఆఫీసుకు వెళ్ళిపోయాను. అనేక పుకార్లు. అనేక అతిశయోక్తులు, కరచూ కళ్ళతోనే చేతులు తిప్పుతూనే మూగ సంభాషణ. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేసరికి చీకటి పడిపోయింది. నాకేదో బాధ పట్టుకుంది. ఎవరో అన్నారు. చచ్చినవాళ్ళల్లో ఆ బెలూన్‌లు అమ్ముకుండే సాయిబుకూడా వున్నాడని. చనిపోయిన వాళ్ళు చాలామంది అలాంటి అభాగ్యులేనని.

"నాన్నా, నా బెలూన్‌బొమ్మ పగిలిపోయింది నాన్నా. ఆ బొమ్మగాడు ఎంత బాగుండేవాడో." ఆ భూతకాలమే నన్ను బాధిస్తోంది. అవును. ఇది భూతాల కాలం. ప్రేతాలు వీరవిహారం చేస్తున్నకాలం. విసురుగా నడిచివెళ్ళాను రావు ఇంటికి. మధ్యాహ్నమంతా నిద్రపోయి అప్పుడే లేచి బయలుదేరుతున్నాడు రావు ఎక్కడికో. పొడుగాటి మనిషి. కండలు తిరిగిన శరీరం. మీసాలు. నాకూ, రావుకు అనేక సంవత్సరాల రాజకీయ పరిచయం.

"ఈ బీదవాళ్ళు ఏంచేశారని వీళ్ళకీ గతి పట్టింది రావ్? బెలూన్‌లు అమ్ముకుండే వాడ్ని చంపి మనం సాధించేదేమిటి? ఆ ముసలివాడ్ని చంపి ఎవరిమీద కసితీర్చుకున్నాం? నువ్వు బయటికి వెళ్ళడానికి వీలులేదు. నువు రాత్రి ఎక్కడున్నావో నాకు తెలీకపోవటంలేదు. నువు మళ్ళీ ఎక్కడికు బయలుదేరుతున్నావో నాకు తెలీకపోలేదు. ఈ హత్యాకాండ నువు చేయిస్తున్నావని నేననటంలేదు. కానీ ఈ హత్యాకాండకు నీ సిద్ధాంతాలు దోహదం చేయుటం లేదని నువు విశ్వసిస్తున్నావా? పరోక్షంగానైనా సరే. నీ సిద్ధాంతాలు ఈ అగ్నిని పెంచటంలేదని నువు ఆత్మసాక్షిగా చెప్పగలవా? రావ్ మనం ఏ పరిస్థితికి దిగజారాం చివరికి? ఆర్థిక, సాంఘిక న్యాయంకోసం పోరాడుతామని కంకణం కట్టుకున్న మనం, చివరకు నేనెందుకూ కొరగాని వాణ్ణయి అసలు రాజకీయాలనుంచే విరమించుకున్నాను, నువు మన సిద్ధాంతాలకు వేరేరూపు నిచ్చావు. ఇది నీకు తగని పని" వణికిపోతూ రావు భుజం పట్టుకున్నాను. రావు నా కళ్ళల్లోకి తీక్షణంగాచూసి, రెండు చేతుల్తో నన్ను పక్కకు తోసేసి, వెళ్ళి ఆ చీకట్లో కలిసిపోయాడు.


* * *

"నాన్నా, బెలూన్‌లవాడు మళ్ళీ వస్తే ఇంకోటి కొను నాన్నా." నేను చిన్నిని దగరకు తీయలేదు. ముద్దాడలేదు. రావు తప్పు దోవ తొక్కాడు. మంచికైనా, చెడుకైనా రావు సమర్థుడు. అతడికి పెళ్ళాం బిడ్డలు లేరు. అతడికి దేశమే సమస్తమూను. నాలాంటి బలహీనుడి మాటలు అతడి చెవికెక్కుతాయా? ఎక్కడో ఒక దుశ్చర్యతో ప్రారంభం. అందుకుగాను ప్రతీకారం, మరోపల్లెలో మరో "గూడా"లో ఎక్కడో ఒక సంఘటన మళ్ళీ ప్రతీకారం. ఈ విషవలయంలో రావు మాత్రం ఏం చేయగలడు?

మర్నాడు ఆఫీసు టెలిఫోన్‌లో పేరు చెప్ప చెప్పకుండా రావు కంఠధ్వని "ఇరు పక్షాల్లోను ఇద్దరు, ముగ్గురు చనిపోయారట. ఆ పేటలోని ఆ బెలూన్‌ల వాణ్ణి పోయి చూశాను. తీవ్రంగా దెబ్బలు తగిలినందువల్ల స్పృహ తప్పింది. ఇప్పుడే హాస్పిటల్‌కు చేర్పించాను. బ్రతుకుతాడులే". రావు ఆజ్ఞలు ఏమనిచ్చాడో, సంఘటనలు సమసిపోయినై. తాత్కాలికంగా శాంతి నెలకొన్నది పట్టణంలో.

"బెలూన్‌లవాడు ఎప్పుడు వస్తాడు నాన్నా?"

ఏమో, ఎప్పుడు వస్తాడో. ఎంత క్షీణించి, ఏ అవిటికాలితో బయటపడతాడో హాస్పిటల్ నుంచి? నడిచి రాగలడో లేదో? భిక్షమెత్తుకొంటాడేమో?




పొడుగు పెరగండి!
"WHEN NATURE FAILS"
ప్రపంచ ప్రఖ్యాతి పొందిన మా "హైటెక్స్" "Hytex" ఔషధం ఉపయోగిస్తే మీరు గ్యారంటీగా 2 నుంచి 6 అంగుళముల వరకు పొడుగు పెరగగలరు. ఏ వయస్సులోవున్నా ఫరవాలేదు. స్త్రీ.పురుషులు పుచ్చుకోవచ్చు. ఒక ఫియల్ వెల (20 Tabs) రూ. 3-75. పోస్టేజి అదనం.
నెరసిన శిరోజాలను పోగొట్టుకోండి
మా నిరపాయకరమైన. సువాసనగల "బాల్ కాలా తేల్" "BAL KALA TEL" తెల్లవెంట్రుకలు శాశ్వతంగా ప్రేళ్లతోసహా నల్లబడేలా చేస్తుంది. ఒక ఫియల్ వెల రూ. 3-75. పోస్టేజి అదనం. 3 ఫియల్స్ వెల రూ. 7-50.
ఉత్తరములు ఆంగ్లంలో వ్రాయుండి.
N. B: Correspond in English
M/S. UNITED COMMERCIAL Co.,
Beat No. 29 (A. W. V./5)
Flat Door No. 3883
AMBALA CANTT. (N. India)